


# నల్లనాగు

## దాశరథి రంగాచార్య

### (1975 ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేకసంచిక నుంచి)


నల్లనాగు
దాశరథి రంగాచార్య
"అమ్మా !"
సుజాత సోఫాలో కూర్చుంది. తీరిగ్గా ఉంది. వారపత్రిక అందుకుంది. సీరియల్లో మునిగిపోతుంది. ఆమెకు ఏమీ కని పించలేదు. వినిపించలేదు.
"అమ్మగారూ!"

"అమ్మా !"

సుజాత సోఫాలో కూర్చుంది. తీరిగ్గా ఉంది. వారపత్రిక అందుకుంది. సీరియల్లో మునిగిపోతుంది. ఆమెకు ఏమీ కనిపించలేదు. వినిపించలేదు.

"అమ్మగారూ!"

పిలుపు కాస్త బిగ్గరగా ఉంది, సుజాత సీరియల్లోంచి బయటపడింది. పైకి చూసింది. తలుపులు బార్లా తీసి ఉన్నాయి. మెట్లమీద ఒక అమ్మాయి నుంచుంది.

అమ్మాయి నల్లరాతి బొమ్మలా ఉంది, శిల్పి మలచిన శిల్పంలా ఉంది. నల్లగా ఉంది. కాటుకలా ఉంది. మధ్య పాపిట తీసింది, వెంట్రుకలు బిగదీసింది. నొసటి కొసన మొల్చాయి కొన్ని వెంట్రుకలు. అవి లొంగలేదు. గాలికి ఆడుతున్నాయి, నొసట కుంకుమ పొడిచిన పొద్దులా ఉంది. కళ్ళు ఆల్చిప్పల్లా ఉన్నాయి. వాటిలో ఎర్రని జీరలున్నాయి కళ్ళు కాస్త ఎరుపు వాటిల్లో అమాయకత కాపురం పెట్టింది. ముక్కు తీర్చిదిద్దినట్టుంది. దానికి ముక్కెర ఉంది. ముక్కెరకు ఎర్రరాయి ఉంది. అది మెరుస్తుంది. బుగ్గలు నున్నగా ఉన్నాయి. వేయి స్తంభాల గుడి స్తంభాల్లా మెరుస్తున్నాయి. పెదవులు ఎర్రగా ఉన్నాయి. మందారాల్లా ఉన్నాయి. చుబుకం చిన్నగా ఉంది. ముద్దొస్తూంది. మెడ కురచగా ఉంది. నల్లపూసలు రంగులో కలిసిపోయాయి. పయ్యెదలో పరువం పిటపిటలాడుతూంది.

చూస్తూ ఉండి పోయింది సుజాత, నవల్లో నాయిక కంటే అందంగా ఉంది.

"అమ్మగారూ; పని మనిషి కావాలెనన్నారట."

సుజాత ఈ లోకంలోకి వచ్చింది.

"నువ్వు పనిచేస్తవా?" ఆశ్చర్యం వ్యక్త పరిచింది.

"అవ్వమ్మా! పనిమనిషి కావలెనన్నరట, వచ్చిన."

"నీ పేరు"

"నీలమణి అంటరు."

"పేరు బావుంది నీకు తగినట్లు పని జాగ్రత్తగా చేస్తావా. మా ఇంట్లో అంతా గాజుసామానుంది."

"నా కెరికేనమ్మా పదిలంగ పనిచేస్త".

తరువాత నెలజీతాన్ని గురించి బేరం జరిగింది. నీలమణి ఒప్పుకుంది. నీలమణి లోనికి వచ్చింది. గిన్నెలు తోమిపెట్టింది. గాజు సామాను కడిగిపెట్టింది. అది పరీక్ష ఆమె నెగ్గింది. మెచ్చుకుంది సుజాత, నీలమణి ముఖం వెలిగింది. మబ్బుల్లో మెరుపు మెరిసింది. తెల్లవారి నుంచి వస్తానని చెప్పింది నీలమణి. వెళ్ళిపోయింది.

నీలమణి సుజాత ఇంట్లోకి రావడం పోవడం చూశారు ఇరుగమ్మలు, పొరుగమ్మలు, గబగబా వచ్చేశారు. నీలమణి ఎందుకు వచ్చిందని అడిగారు. చెప్పింది సుజాత.

"అబ్బో! అది నంగనాచి, మగవాళ్ళ మనసు పాదరసం లాంటిది. దాన్నెందుకు పెట్టుకున్నారు?" ఆశ్చర్యం వ్యక్తపరచారు అమ్మలక్కలు.

చిరునవ్వు నవ్వింది. సుజాత, "మా వారు అలాంటివారు కారు. మరో ఆడదాన్ని కన్నెత్తైనా చూడరు మీరు నిశ్చింతగా ఉండండి" సుజాత కళ్ళలో గర్వం కనిపించింది.

వచ్చినవారు మూతులు విరిచారు. నీ ఖర్మ అన్నట్లు చూశారు వెళ్ళిపోయారు.

సుజాతకు విశ్వనాథం కనిపించాడు కళ్ళలో. విశ్వనాథం నిష్ఠ గలవాడు. అతడు సుప్రభాతం చదువుతాడు. విభూతి వంటినిండా ధరిస్తాడు. సంధ్య వారుస్తాడు. నమకం, చమకం వగైరాలన్నీ చదువుతాడు. నిత్యం పూజ చేస్తాడు. విభూతితోనే ఆఫీసుకు వెళ్తాడు. అతనొక ఆఫీసరు, గుడి కనిపిస్తే గుంజీళ్ళు తీస్తాడు. ఆఫీసులో అతనికో స్టెనో ఉంది, షర్మిలా, వగలాడి వన్నెల విసనకర్ర. ఆవిడ విశ్వనాథానికి వలపన్నింది ప్రమోషన్ కోసం, విశ్వనాథం లొంగలేదు. షర్మిలాను ట్రాన్స్ ఫర్ చేయించాడు, ఆ విషయం తెలిసింది సుజాతకు. సుజాత పొంగిపోయింది. విశ్వనాథాన్ని ముద్దుపెట్టుకుంది మెచ్చుకోలుగా.

తెలవారి నీలమణి వచ్చింది, తలుపు తట్టింది, విశ్వనాథం తలుపు తీశాడు. నీలమణిని చూశాడు. చూస్తూ ఉండిపోయాడు.

"పని మనిషిని, అమ్మగారు పెట్టుకున్నారు, అడ్డం జరుగుండి."

అడ్డు జరిగాడు విశ్వనాథం. నీలమణినే చూస్తున్నాడు. అటునుంచి సుజాత వస్తూ ఇటునుంచి నీలమణి పోతూ కనిపించారు. విశ్వనాథం నీలమణి నడకను చూశాడు. ఆమె పిక్కలు మెరుస్తున్నాయి, సంగడి పట్టిన నలముద్ద కోళ్ళలా ఉన్నాయి. వాటికి వెండి కడియాలున్నాయి, అవి తళుక్కుమంటున్నాయి.

ఆ నాడూ పూజ చేశాడు విశ్వనాథం. అతనికి శివుడు కనిపించలేదు. నీలమణి కనిపించింది, సుజాతను తల్చుకున్నాడు. తేరుకున్నాడు, నిగ్రహించుకున్నాడు, ఆఫీసుకు వెళ్ళాడు.

నీలమణి పనికి వస్తూనే వుంది.

విశ్వనాథం చూస్తూనే ఉన్నాడు సుజాత కంటపడకుండా.

ఒకనాడు టెలిగ్రాం వచ్చింది, సుజాత తల్లికి జబ్బుగా ఉందని. విశ్వనాథం తనకు సెలవు లేదన్నాడు. రావడం వీలుపడదన్నాడు. సుజాతకు వెళ్ళక తప్పలేదు. వెళ్ళింది.

తెల్లవారింది. నీలమణి తలుపు తట్టుతుందని చూశాడు. నీలమణి రాలేదు. రాదని తేల్చుకున్నాడు. సుజాత రావద్దని చెప్పిందనుకున్నాడు. కట్టుదిట్టం చేసి వెళ్ళిందనుకున్నాడు. కస్సు బుస్సు మనుకున్నాడు. ఆడవాళ్ళంతా ఇంతేననుకున్నాడు. ఆఫీసుకు వెళ్ళాడు. తిరిగి వచ్చేప్పుడు స్కూటరు నీలమణి ఇంటివైపు మళ్ళించాడు. ఇల్లు తెలుసుకోవడం కష్టం కాలేదు.

నీలమణి గుడిసెముందు కూర్చుంది చేటలో బియ్యం ఏరుతూంది. స్కూటరు చప్పుడు విన్నది. తలఎత్తింది, విశ్వనాథం కనిపించాడు. లేచి నుంచుంది.

"పనికి రాలేదేం?"

“అమ్మగారు లేరు గద!”

“హోటలు తిండి పడదు నాకు. కాస్త వండి పెట్టాలి. ఏమంటావ్?”

“అట్టనే వస్త పొద్గాల”

“ఇప్పుడు రారాదూ!”

“ఆయనొస్తదు అన్నానికి. పొద్గాల వస్త”

“సరే ఈ పూట హోటల్లో తింటా. ఉదయం తప్పకుండా రావాలి. ఏమంటావ్?”

“అటనేనుండి."

విశ్వనాథం స్కూటరు సాగిపోయింది.

తెల్లవారకుండానే లేచాడు విశ్వనాథం. తలుపు తట్టిన చప్పుడు కోసం ఎదురు చూశాడు.

కాలం కదలడం లేదు.

తలుపు తట్టడం వినిపించడం లేదు.

నీలమణి రాదేమోననుకున్నాడు. ఏదో పోగొట్టుకున్నట్టు వెదుక్కోసాగాడు.

తలుపు తట్టిన శబ్దం వినిపించింది. ఉరికాడు విశ్వనాథం, తలుపు తీశాడు.

నీలమణి కనిపించింది.

విశ్వనాథంలో విద్యుత్తు ఉరికింది.

నీలమణి తలవంచుకుంది, సాగిపోయింది.

విశ్వనాథం ఆమె నడకను చూస్తున్నాడు పిక్కల్ను చూస్తున్నాడు.

విశ్వనాథం తలుపు వేశాడు. గొళ్ళెం వేశాడు.

నీలమణి గమనించలేదు, ఆమె పనిలో మునిగిపోయింది.

ఇల్లు ప్రశాంతంగా ఉంది. ఎవరూ లేరు. తాను నీలమణి విశ్వనాథం గుండె ఉరుకులు పెట్టింది, గదిలోకి వెళ్ళాడు. కొన్ని నోట్లు తీసుకున్నాడు. డబ్బు అన్నింటినీ కొనగలదనే విశ్వాసం విశ్వనాథానిది. అందుకే అతనికి భక్తి మెండేమో.

విశ్వనాథం నీలమణి దగ్గరికి చేరాడు. నీలమణి గిన్నెలు తోముతూంది. బూడిదతో ఆమె చేతులనిండా బూడిద ఉంది. విశ్వనాథం డబ్బు చూపాడు నీలమణికి.

“జీతం వయలికి తీసుకుంట అమ్మగారిస్తరు."

“జీతం కాదు. ఉంచుకో పాపం కష్టపడుతున్నావు.”

“మేం కష్టపడేటోండ్లమే” నీలమణి తల పైకెత్తలేదు. ఆమె గాజు ప్లేటు తోముతూంది.

విశ్వనాథం మరి దగ్గరికి వచ్చాడు.

నీలమణి గమనించింది. ఆమె గుండె గుబగుబలాడలేదు. కాళ్ళు వణకలేదు. నోరు ఆర్చుకుని పోలేదు. ఆమె పని చేస్తూనే ఉంది. చేతిలో గాజు ప్లేటుంది.

విశ్వనాథం నీలమణి చేయిపట్టుకున్నాడు. నీలమణి చేతిలోంచి ప్లేటు జారిపడింది. చప్పుడైంది, పగిలింది, విశ్వనాథం గమనించినట్లు లేదు. నీలమణి చేయి విశ్వనాథం చేతిలో ఉంది. చేయి మెత్తగా లేదు, పూవులా లేదు, సుజాత చేతిలా లేదు. అది కఠినంగా ఉంది. కర్కశంగా ఉంది. రాయిలా ఉంది.

నీలమణి విశ్వనాథాన్ని చూసింది ఆమె కళ్ళు ఎర్రగా ఉన్నాయి, మోదుగు పూలలా ఉన్నాయి. ఆ కళ్ళు విశ్వనాథంలో అగ్గి రగిల్చాయి. మరో అడుగు ముందుకు వేశాడు.

"అయ్యగారూ! చెయ్యి వదులుండి మీరు పెద్దోళ్ళు"

అదేం లేదు ఒక్కసారి, ఇకిలించాడు విశ్వనాథం.

"విడువుండి" గట్టిగా అరిచింది.

విశ్వనాథం ఆమెను దగ్గరికి లాక్కున్నాడు.

నీలమణి విదిలించింది, చేయి విడిపించుకుంది. దూరం జరిగింది.

విశ్వనాథం లంఘించాడు. పొదివి పట్టుకున్నాడు.

నీలమణి మండిపోయింది. అగ్నిజ్వాల అయింది. పెద్దగా కేకలు పెట్టింది. విశ్వనాథాన్ని నెట్టింది. అతను పడిపోయాడు. అతని భుజానికి పగిలిన గాజు పెంకు గుచ్చుకుంది. రక్తం కారుతుంది. నీలమణి అది చూడలేదు. ఆమె ఆదిశక్తిలా ఉంది. విశ్వనాథం చేయి అందుకుంది, కేకలేస్తూంది, బయటికి లాక్కు పోతూంది. విశ్వనాథాన్ని గుమ్మం బయిటికి లాక్కొచ్చింది.

నీలమణి కేకలు విన్నారు చుట్టుపక్కల వాళ్ళు కూడాను.

"చూసిన్రా అమ్మ నేను కావల్నట ఈ అయ్యకు. బంగారుమసువంటి పెండ్లం ఉన్నది" నీలమణి అరుస్తూంది. అందరికీ చెప్తుతూంది. విశ్వనాథం కిక్కురుమనలేదు. తలవంచుకున్నాడు. నుంచున్నాడు.

ఇంటిముందు ఆటో ఆగింది. సుజాత దిగింది. విన్నది. చూసింది.

"నాటకం వేసింది ఇందుకా?" అని "నీలమణి నువ్వు గట్టిదానివి, ఆడది లొంగి చెడ్డది. ఎదిరించాలి, ఆడది ఎదిరించాలి. ఎదిరించక గత్యంతరం లేదు" అంటూ పెద్ద పెద్ద అంగలు వేస్తూ ఇంట్లోకి వెళ్ళింది. తలుపు దఢాల్న వేసింది. విశ్వనాథం ముఖాన మూసినట్టుంది తలుపు.

విశ్వనాథం అటు చూశాడు.

కూడిన ఆడవారు ఘొల్లుమని నవ్వారు.

విశ్వనాథం పూజ చేయలేదు. అయినా అతని ముఖానా, వంటినా బూడిద ఉంది. భుజానికి గాయం వుంది. అతనికి ఆ బాధ తెలియడం లేదు. అతడు మూతపడిన తలుపుల్నే చూస్తున్నాడు.

నీలమణి వెళ్ళిపోతూంది.

కూడిన మగవాళ్ళంతా ఆమెనే చూస్తున్నారు.

ఆమె నల్లనాగులా కనిపించింది.

వంకర్లు వంకర్లు గా సాగిపోతూంది నీలమణి కాదు నల్లనాగు.

★★★

.

COMMENTS